కేసి వొంకలో దిగింది. నడిమధ్యకొచ్చింది.
'ఇంగేముంది.. ఇవతలికి వచ్చిందిలే!' అనుకున్నా.
ఒక్కసారిగా నీళ్ల వరవడికి ముసిలి గొడ్డు నిలదొక్కోలాక పట్టుదప్పింది. గొడ్డు తిరగబడి దాని నాలుక్కాల్లూ పైకి లేసినయ్. నా గుండె ఝుల్లుమనింది. కళ్లముందరే సుళ్లు దిరిగే నీళ్లమ్మిడి ముసిలి బర్రె కొట్టుకోనిపాయ. ఆడికీ కొంతదూరం వంకగడ్డన పరిగెత్తినా, కనపడక పాయ.
''చాతలారా బర్రెను నీళ్లపాలు జేచ్చివి గదరా!'' అన్నారు పక్కనున్నోళ్లు.
అప్పటికే కంజీకటిబడి దీపాలుబెట్టే యాలయ్యింది. నేను పిల్చి దానిపానం నీళ్లపాలు జేచ్చినానని నాకూ దుఃఖం ముంచుకొచ్చింది. గొడ్డును గంగలో కలిపొచ్చిన సంగతి మాయమ్మకు జెప్పి..
''నావల్లనే నమ్మా'' అంటే..
''నువ్వుగాంగా కావాలని జేచ్చివా నాయనా! అంతా గంగమ్మ దయ!'' అనింది మాయమ్మ.
ఆరేత్రికి మిగిల్నోల్లము తలాపిడస అన్నం తిని సలికి ముడుక్కుంటే.. మాయమ్మ మటుకు మెతుకు ముట్టకుండా మాటిమాటికీ వాకిట్లోనుంచి ఈదిలోకి సూచ్చా ఉండాది.
ఎప్పటికో నిద్దర బట్టబోతాండగా బర్రె అరుపు వినొచ్చింది.
''నాయినా! కరెంటు బోయినట్టుంది.. బ్యాటర్ లైటు తీసకరా'' అన్న మాయమ్మ పిలుపుతో, పూర్తిగా మెలుకువ వచ్చి బయటకొచ్చి సూచ్చే.. లైటు వెలుగులో ముసిలెనుము.
'నేనొచ్చినా!' అని మమ్మల్ని సూసి అరుచ్చా ఉంది సలికి వనుకుతా.
గుంజకాడ ఇంత వట్టిగెడ్డి బేసి, దానికి తలుగు బెట్టి మాయమ్మ అప్పుడు బువ్వతినింది.
నాకు.. 'నావల్లనే!' అనే బాధ తీరింది.
ముసురు తగ్గినాక ఒక ఆదివారం నాడు కోడిపుంజును కోసి గంగమ్మకు పొంగల్లుబెట్టి మాయమ్మ మొక్కు దీర్చుకునింది.

* * *

కాలికి కట్టుతో కదల్లాకుండే ముసిలెనుముకు మేతా, నీళ్లు పెట్టడానికి కొట్టంలోకి పోయినప్పుడల్లా.. ఈ సంగతులన్నీ గెవనానికొచ్చి కడుపులో బాధైతాంది.
వారం పదిరోజులై పాయ, దానికాలు కట్టుకున్నెట్టు కనబడ్డం లేదు.
''బర్రె పరిచ్చితి ఏంది మామా'' అని వీర్రాఘవ మామను ఎచ్చరిచ్చే, వచ్చి సూసి..
''రెండు వారాలకు మళ్లీ కట్టుగట్టి సూజ్జంలే దొరా'' అంటా బీడీ తాగుతా ఎలబారిపాయ.



సేని దిట్టు పోదామని, సద్దికూడు తినే టయానికి కటిక మనిషి, దళారి పిచ్చిమామను తోడుకోని మళ్లీ మా ఇంటికొచ్చిండు.
వాళ్లొచ్చింది కాలిరిగిన మా ముసిలిబర్రె కోసమేనని అర్థమయ్యింది. మా నాయనతో అప్పటికే మాటలు జరిగినట్టుండాయి. లేకుంటే వాళ్లకు నా ముందరికొచ్చే ధైర్యం లేదు. దానికి కాలు ఇరక్కముందే ఒకసారి కటెక్కు అడిగి నాసేత తిట్లు పొయ్యుండారు గదా!
నాకింగ సద్దిబువ్వ తినబుద్ధిగాక, సెయ్యికడుక్కొని బయటికొచ్చి..
''కూకోండి మామా!'' అంట పిచ్చిమామ దిట్టు సూచ్చా. వక్కాకు తుపక్కన గోడపక్క ఊసి, పైగుడ్డ సర్దుకుంటా..
''ఏమబ్బా! బాగుండావా'' అని పలకరిచ్చిండు యాపారం జేసే ఆ మనిషి.
ఆ యప్ప మాములుగా అడిగినా.. అది నాకు యాన్నో తగిలింది.
'ఇంతకుముందు అడిగితే కాదన్నావు గదా! దానికి కాలిరిగింది, కట్టుకునేది బరువు. పళ్లు ఊడిపోయిండాయి.. గెడ్డిగూడా సరిగా తినలేదు. పనుకుంటే లెయ్యలేదు.. నలుగురుబట్టి లేపాల. అది మీకేమైనా ఆదాయం జేసేదుండాదా? మేపు దండగ్గాకపోతే! ఆపొద్దు మామిందికి గయ్యమని లేసినోడివి.. ఈపొద్దు దాన్ని మాకు అమ్మకుండా ఎట్టా తప్పించుకుంటావో నేనూ జూస్తా!' అన్నెట్టుగా ఉండాదా పలకరింపు.
నేనేమీ బదులు పలకలా. మాయమ్మ తలొంచుకోని బియ్యంలో రాళ్లు యేరుకుంటాంది..
మద్దినాల ఎసుట్లోకి.
ఇదేం పట్టనట్టు నా బాసేలి మా సంటితల్లికి జల్లో పూలు పెడతా ఉంది.
''నువ్వన్నా ఏమన్నాజెప్పు మామా!'' అన్నేడు పిచ్చిమామ మా నాయనతో.
''సెప్పేదేముంది మామా! నీకు తెల్దా? మా రాతో.. దారాతో! పాయంలో దాన్ని అమ్ముకోలేక పోయినా. ఈనాటికి గాటిమీద గొడ్డు సెరుపయ్యిండాది. వచ్చే ఎంత, పోతే ఎంత. దాని బాధ సూడలేకుండాము. ఏదోకటి జేసి తోలకపోండి'' అని తీరుమానం జేసిండు మా నాయన.
నాకు పదురు బుట్టింది. ఇప్పటికి నేను మా నాయనకు ఎదురాడింది లేదు. అది మాకు జేసిన మేలుకు బర్రెను సూచ్చా సూచ్చా కోతకు ఇచ్చేదానికి పానం ఒప్పుకోడం లేదు. అటు నాయన, ఇటు పాశం.
నా కండ్లలో నీళ్లు మాయమ్మ కనిపెట్టింది. మా నాయనకు ఎదురు సెప్పలేదు.
పిచ్చిమామ సంచాకారం మా నాయన సేతిలో పెట్టబోతా ఉండాడు.. బేరం తెంచేదానికి.
ఎట్నో కనాకష్టంగా..
''గొడ్డును ఇచ్చేది లేదు మామా!'' అని అనగలిగాను.. తలొంచుకొని, పానమంతా ఉగ్గబట్టుకోని.
మా నాయన మొకంలోకి సూడాలంటే భయమైతాంది.
మా నాయనకు కోపం నసాలకి లేసింది.
''దాన్ని వాన్నే కోసుకోని తినమని సెప్పు మామా! రైతుకు పనికిరాని గొడ్డును ఏమి జేసుకోవాల్నో ఆయన్నే సెప్పమనండి. వాటం తప్పొయ్యింది. ఎట్టబొయ్యేదాన్ని అట్ట పోనియ్యాల. ఎవురు తినేది వాడు తినాల. అన్నిటికీ మనం కర్తలమా! ఈనాటికి మా కొంపలో నా మాటకు విలువలేకుండా పొయ్యింది. ఇది వాని పునికెన పుట్టిన బుద్ధి గాదులే! వాళ్ల బుద్ధిబుట్టినట్టు జేసుకోనీ!'' అంటా మాయమ్మ దిట్టు ఉరిమిచూసి, కండవ ఇదిలిచ్చి బుజానేసుకొని విసురుగా బయటికిపోయిండు మా నాయన.
''అదిగాదురా! మీ నాయన సెప్పింది గూడా..'' అంటా మాయమ్మ ఏదో సెప్పబోయింది.
''ఏది గాదమ్మా! యాలగాని యాల నాయన ఎమ్మార్వో, ఎండీవో, బ్యాంకీ సారూ ఎవురుబడితే వాళ్లను ఇంటికి తెస్తే, అప్పటికప్పుడు దాని పొదుగు బిండి కాపీ జేసి ఇస్తావుంటివే. దాని పానం గురించి గంగమ్మకు మొక్కున్నె దానివి.. ఈపొద్దు నువ్వు గూడా నాయన మాట ఇనమంటే ఎట్టా? అది నిలబడి పొయ్యిందనే గదా! రేపు మీరుగూడా పనిజెయ్యలేక నిలబడిపోతే.. తిండిదండగ అవుద్దని మీగ్గూడా పురుగులమందు పొయ్యేద్దా!?'' అంటిని కోపంగా.
కోపంలో అంతమాట అంటాననుకోలేదు.
''పోరా పిచ్చినాకొడకా! పాలుదాగిన గొడ్డుమీద అంత పానం కొటకలాడే వాడివి.. నువ్వేనా మాకు మందు పోసేది!'' అని, పిచ్చిమామ దిట్టు తిరిగి..
''అన్నా! వాడి మాట కాదని గొడ్డును ఇచ్చినా.. కుల్లుకుంటా ఉంటాడు. పోయిరాపోండి'' అనింది.
''మనగుండా ఈళ్ల ఇంట్లో గలభా ఎందుకు పోదాం పాప్పా!'' అనుకుంటా వాళ్లు యలబారి పోయిరి.
మాయమ్మ సూడకుండా నేను మా బాసేలి గడ్డం బట్టుకోని..
''మ్మేయ్! ముసిలి బర్రెకు మెత్తటి గెడ్డేసి మేపు. పిరికెడు ఎక్కువగా తవుడేసి నీళ్లు తాపు'' అని బంగపడుకున్నా.
దానికి మళ్లీ కట్టు కట్టించినా కూడా.. కాలు మోదుగా తయారయ్యింది తప్ప పూర్తిగా బాగుపడలేదు.
ఇప్పుడు దానిపేరు.. కుంటెనుము.

* * *

ఉగాది రోజులు.
పొద్దుతిరుగుడు పూలు కోపిచ్చి కళ్లానికి తోలి, మద్దినాల సంగటికి ఇంటికొచ్చినా.
నా గిన్నెలో సంగటిబెట్టి కుంటెనుముకు నీళ్లుతాపి రావడానికి పోయిన నా భార్య..
''ఓబ్బా! ఎనుము అదోరకంగా ఉంది. సూజ్జువురా'' అంటా పిలిసింది ఆదుర్దాగా.
నేను పొయ్యేసరికి పానమిడిసిన ముసిలెనుము కండ్లు, నన్నే జూచ్చా..
'పొయ్యొచ్చా నాయనా!' అన్నెట్టుండాయి.
దాని మెడ తలుగు తప్పిచ్చినా. ■

## వెంకటరెడ్డి గంటా



గల్ఫ్ దేశమైన కువైట్‌లో.. భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తున్నారు గంటా వెంకటరెడ్డి. తల్లిదండ్రులు రామలక్ష్మమ్మ – సుబ్బారెడ్డి. స్వస్థలం కడప జిల్లా గోపవరం మండలంలోని పాయకట్టు ప్రాంతపు కుగ్రామం.. బేతాయపల్లె. బద్వేల్‌లోని బీవీఆర్ కళాశాలలో బీఎస్సీ చదివారు. బతుకుదెరువు కోసం గల్ఫ్ బాటపట్టారు. తెలుగు సాహిత్యంపై మక్కువ ఎక్కువ. బతుకు దెరువుకోసం ఎడారి దేశం వచ్చి.. నానా కష్టాలు పడుతున్న తోటి కార్మికుల వెతలను 'ఎడారి సేద్యం' పేరుతో అక్షరీకరించారు. ఆ కథను ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేయగా.. పాఠకుల నుంచి మంచి స్పందన వచ్చింది. ఈ కథను చదివిన కొందరు సాహితీమిత్రులు.. కథలు రాయమని ప్రోత్సహించారు. అప్పుడే.. తన పాడిపశువుతో ఏర్పర్చుకున్న బంధాన్ని 'మెడ తలుగు' కథగా రాశారు. వీరి తొలి కథకే 'నమస్తే తెలంగాణ – ముల్కనూరు ప్రజాగ్రంథాలయం' అవార్డు దక్కింది. గల్ఫ్ జీవితంలోని పని ఒత్తిడి వల్ల ఎక్కువగా రాయలేకపోతున్నాననీ, భవిష్యత్తులో మరిన్ని కథలు రాస్తానని రచయిత చెబుతున్నారు.